ముందు - వెనుక

శ్రీ భమిడిపాటి అనంతకృష్ణమూర్తి

గుంటూరు పోలీసు స్టేషనులో అతినిశ్శబ్దం ఆవరించియున్నది. బైట వరండాలో గస్తీపోలీసు బూట్లచప్పుడు, లోపల పంకా తిరుగుతున్న చప్పుడు తప్ప మిగతా అంతా నిశ్శబ్దం. క్రొత్తగా ఛార్జి పుచ్చుకున్న వేణు ఆఫీసుఫైల్సు ఒకదానివెంట మరొకటి తిరుగవేస్తున్నాడు. కానిస్టేబిలు చూచిన ఫైళ్ళను తీసికొనివెళ్ళి యథాస్థానమున సర్దుతున్నాడు. ఉన్నట్లుండి వేణు దృష్టి ఒక ఫైలుమీద నిలిచిపోయింది. దానిమీద 'ఇజాక్' అని యున్నది. ఆ పేరు చూడగానే వేణు పాక్ తిన్నవానిలాగ కుర్చీలో చేరగిలబడ్డాడు. దీన్ని గమనించిన కానిస్టేబిలు "అది 'ఇజాక్' అనే దొంగలముఠా నాయకునిదండీ! రెండు మూడుసార్లు పట్టుకుందామని దాడిచేశాము కాని తప్పించుకు పారిపోయాడు. కొంచం గట్టి ఘటం..." అంటూ నీళ్లు నమిలాడు. వేణు ఆ ఫైలును అమూలాగ్రంగా చదివాడు. ఏదో ఆదుర్దాగా వెతుకుతున్నట్లు జేబుదొంగల ఫొటోలను ఒక్కసారి పరిశీలించాడు. చివరకు ఒక్క నిట్టూర్పు విడిచి ఆ ఫైలు మూసి కానిస్టేబిలుకు అందించాడు. కుర్చీలో వెనక్కు జారగిలబడి నుదుటిమీద విపరీతంగా పట్టిన చెమటను తుడుచుకుంటూ ఖరాపంక చూడసాగాడు.

రోజులు దొర్లిపోతున్నవి. ఎవరి పనులు వారు చేసుకపోతున్నారు. గడియారం ఒకదాని తరువాత మరొక అంకెను చూపిస్తూ గమ్యస్థానం లేనిదానిలాగ సాగిపోతున్నది. వేణు మాత్రం పట్టుదలగా పని చేస్తున్నాడు. కనీసం రోజుకొక సారైనా 'ఇజాక్' ఫైలు చూస్తుండేవాడు. చూచినప్పుడల్లా అతని ముఖంపై బాధాచిహ్నాలు కనుపించేవి. వానితోబాటు నిట్టూర్చడం జరుగడం పరిపాటయింది.

ఆ నాడాదివారం. అయినా ఒకసారి ఆఫీసుఫైల్సు చూచిపోదామని వేణు వచ్చాడు. ఇంతలో టెలిఫోను గంట మ్రోగింది. ఫోను రిసీవు చేసికొని తన ఐడెంటిటీ చెప్పాడు. అటువారు ఎవరో, ఏమి చెప్పారోకాని వెంటనే పోలీసును పిలచి దాడి జరుపడానికి వాన్‌ను సిద్ధం చెయ్యమని, ఒకసారి తన పిస్టలులో గుళ్లు పరీక్షించి బైలుదేరాడు. వాన్ బయలుదేరినవైపే చూస్తూ మిగిలియున్న పోలీసులు "ఇదివరకెన్ని ఆకస్మికదాడులు జరుపలేదు! యిదీ అంతేలే..." అని గుసగుసలాడసాగారు కొందరు. ఒకడు "కొమ్ములు తిరిగినవారే ఏమి చేయలేక పోయారు" అన్నాడు నిస్సారంగా.

రెండుగంటలకల్లా వెళ్ళిన వాన్ తిరిగివచ్చింది. వాన్‌లోనుండి దిగినవారి వదనాల్లో నిరుత్సాహం, నిస్పృహ, అలసట కనిపించినాయి. వేణు వాన్‌నుండి దిగకుండా అందులోనే యింటికి వెళ్ళాడు.

వేణు రాత్రింబగళ్లు 'ఇజాక్'ను గురించే ఆలోచనలు. చూడబోతే మంచి తెలివితేటలుగల వ్యక్తి అనిపించాడు. కాని మరి యిలా ఎందుకు మారాడో! ఒక్కొక్కప్పుడు ఆలోచనలతో చలించిపోయేవాడు వేణు.

ఒకరోజున ఏమితోచక సాయంకాలం సినిమాకు బయలుదేరాడు. వెంట మూరుదుస్తులలో కానిస్టేబిలు కూడ నున్నాడు. థియేటరు ముందు సిగరెట్టు వెలిగించి దారిన వచ్చేపోయేవారిని చూస్తూ నిలబడ్డాడు. కానిస్టేబిలు టికెట్టు కొనడానికి వెళ్ళాడు. ఇంతమంది ఇన్‌స్పెక్టర్ల కండ్లలో దుమ్ముకొట్టి గతంలో తప్పించుకు తిరుగుతున్న ఇజాక్‌ను తనైనా పట్టుకోగలుగుతానో లేదోయనే వేణు ఆలోచన. ఆకస్మికంగా దారినపోయే వ్యక్తిమీద అతని దృష్టిపడి వెంటనే వేణు ముందువెనుకలు చూడకుండా 'ఇజాక్' అని ఎలుగెత్తి కేకవేసి ముందుకడుగేశాడు. ఆ కేక విన్నవ్యక్తి పారిపోవసాగాడు. అప్పుడే తిరిగి వస్తున్న కానిస్టేబిలు అతని వెంటబడ్డాడు. ఎక్కువ శ్రమలేకుండానే పట్టుబడ్డాడు ఇజాక్. రెక్కలు విరిచి పట్టుకొని అతనిని వేణు దగ్గరకు లాక్కొచ్చాడు కానిస్టేబిలు సగర్వంగా. వేణు అతని ముఖం పారజూస్తూ "నీవేనా ఇజాక్" అన్నాడు ప్రజ్వలించే నేత్రాలతో.

కానిస్టేబిలు యమకింకరుడులాగ "దొంగవెధవ! ఎంతకాలం యిలా తప్పించుకొని తిరుగుదామను

(620వ పేజీ చూడుడు)

(584 వ-పేజీ తరువాయి)

కున్నావు! మా దొరగారు నిన్ను, నీ పేరుకూడ గుర్తించుకొని వెంటాడుతున్నారు" అన్నాడు.

అదిచూచి జనం గుంపుకూడారు. వేణు స్టేషనుకు ముందు నడుస్తుంటే కానిస్టేబిలు ఇజాక్ చేతికి బేడీలు తగిలించి వెనుకనే వెంట తీసికొనివెళ్ళాడు. నడచి పోతున్నంతసేపు వేణు ఇజాక్‌ను గురించే పరిపరి విధాల తలపోస్తూయున్నాడు.

♦ ♦ ♦

ఒకప్పుడు ఇజాక్ తన సహాధ్యాయి, స్నేహితుడు కూడాను. యిప్పుడో - తన అధీనంలోనున్న బందిపోటు దొంగ! తాము చదువుకునే రోజులలో అప్పుడప్పుడు తన దరిద్రాన్ని, నిస్సహాయతను దృష్టిలో నుంచుకొని ఇజాక్ "జీవయాత్రలో నీతినియమాల వల్ల సదవకాశాలు, సత్ఫలితాలు లేనప్పుడు ఏ పనైనాచేసి బ్రతుకవచ్చు" అని అంటుండిన మాటలు స్ఫురణకువచ్చి వేణు కండ్లు చెమ్మగిల్లాయి. ఇజాక్‌ను ఎలాగైనా కాపాడాలని అనుకున్నాడు; కాని తన ఉద్యోగధర్మమో - నేరస్తుణ్ణి శిక్షార్హుడుగా చేయాలి! తను కాపాడి యీసారికి పంపితే మరల యీ దోపిడీలు, జేబుదొంగతనాలు చేయడంకంటె శిక్షింపబడి ఇజాక్ సత్పురుషుడుగా సంస్కరించబడితే మంచిదనిపించింది; తన ఉద్యోగ ధర్మానికి విఘాతంలేకుండా కూడ యుంటుంది.

కానిస్టేబిలును పిలచి వేణు ఇజాక్ ఫైలు తెప్పించి మరొకసారి పరిశీలించాడు. అబ్బ! ఎన్ని దొంగతనాలు, ఎన్ని మోసాలు! ఇతర నేరస్తులతో బాటు ఇజాక్ కూడ వేణుముందు హాజరుపరచబడ్డాడు. వేణు, ఇజాక్ ఒకరి ముఖాన్ని మరొకరు పారజూచుకొని తలలు దించేసుకున్నారు. ఇజాక్ కండ్లనుండి రెండు నీటిబొట్లు నేలమీద రాలాయి, వేణు గుండె దడదడలాడింది. పోలీసును పిలచి ఖైదీని తీసికొనిపొమ్మని మూగసంజ్ఞ చేశాడు. మరునాడు నేరం విచారణ జరిగింది. రెండేండ్లు కఠినశిక్ష విధించబడింది. విచారణ సాగినంతసేపు వేణు కాలు కాలిన పిల్లిలాగ తిరిగినా తన విద్యుక్తధర్మాన్ని నెరవేర్చకలిగాను కదాయని సంతృప్తిపడ్డాడు. ఇజాక్‌ను పోలీసులు వాన్‌లో ఎక్కించుకొని బయలు దేరుతుంటే తిరిగి, వేణు ఇజాక్‌లు ఒకర్నొకరు జాలిగా చూసుకున్నారు. వాన్ కదలిపోయింది.

వేణు తన పూర్వస్మృతులతో యింటిదారి పట్టాడు. చదువుకునే రోజుల్లోని ఆనందం, స్వేచ్ఛ మళ్ళీ రావుకదాయని వాపోయాడు. ఒకసారి ఇజాక్ తమాషా చేస్తానన్నాడు. అతని జేబులోని రూపాయి ఎలాగ మాయమైపోందో చూడమన్నాడు. నిజంగానే మరొక అయిదు నిముషాలలో తన జేబులోని రూపాయి మాయమై ఇజాక్ జేబులోకి చేరింది. అబ్బ! అఖండమైన తెలివితేటలు - కాని వాని వినియోగమా! అందుకు కారణాలనేకం..." ఒక్కొక్కరి జీవితంలోని భావి వాసనలు ముందుగానే ప్రతిఫలిస్తవి. చదువుకునేరోజుల్లో ఇజాక్, వేణు సన్నిహిత స్నేహితులు. చాలాకాలం తరువాత ఆ యిరువురి స్నేహితుల సమాగమ పరిస్థితులు వేడినిట్టూర్పులకు, ఆశ్రుజలతర్పణానికి దారి తీసింది. విధి, విరామంలేకుండా కాలం దొర్లిపోసాగింది.

వేణు ఉద్యోగధర్మంలో ఫైళ్లు వస్తున్నవి, పోతున్నవి. పట్టుదల, కార్యదీక్ష, శక్తిసామర్థ్యాలు వేణును ఉత్తమ ఉద్యోగిగా రాణింపజేయసాగినవి.

రెండేళ్లు గతించిపోయినవి. ఇజాక్ ఆరోజు విడుదల ఆర్డర్లు పుచ్చుకొని శిక్షనుండి బయటపడ్డాడు. ముందుకు నాలుగడుగులు వేశాడో లేదో "ఇజాక్!" అన్న పిలుపు వినిపించి వెనుకకు తిరిగి చూచాడు. ఇన్స్పెక్టర్ వేణు! - ఆ పిలుపు ఇజాక్ గుండెల్లోనుండి దూసుకపోయింది. మరొక క్షణంలో వారిరువురు ఒకరిచేతుల్లో ఒకరు వాలిపోయారు. గడచిన విషయాలు... హృదయస్పందనంలో ఒకరికొకరు తెలుపుకున్నారు. మూగవోయిన గండుగోయిలలు... ఒక్కసారి చివురాకులు మేసికూసినట్లు... వారి మనోవేణువులు పులకరించి పలుకరించుచున్నవి. పునఃసమాగమము వారి పశ్చాత్తాపము మాటలకందని స్థాయిలో ఒకర్నొకరికి దగ్గరగా చేర్చింది - పవిత్రసమాగమము.

ఇజాక్ మనస్తత్వంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. ఎన్ని కష్టాలను, దుస్థితిని ఎదుర్కొవాల్సి వచ్చినా నీతినియమాలే మానవుని ఔన్నత్యానికి తోడ్పడతవనే విశ్వాసం ప్రబలింది. భావాలు మార్చుకున్నాడు. తనకు కూడుగుడ్డ కరువైనవని గతంలో అడ్డదారిన నడిచాడు. పశ్చాత్తాపం ఎంతటి దుర్మార్గానికైనా విరుగుడు! జైలుశిక్ష! అందులోనూ తన స్నేహితుడు వేణు ద్వారానే - అతనిని చూచ్చే

సింది. నీతి, నిజాయితీలతో జీవయాత్ర కుపక్రమించాడు ఇజాక్.

♦ ♦ ♦

ఒకసారి క్రిందకుమళ్ళిన బండిచక్రం ఆకులు పైకి వచ్చేలాగున స్వాతంత్రోద్యమంలో ఇజాక్ చిత్తశుద్ధి గల స్వచ్ఛందసైనికుడుగా రాణించాడు. ప్రజల ఆదరాభిమానములతో అఖండత్యాగాలు చేసి, వీరోచితంగా పోరాడి ఉద్యమానికి నాయకత్వం వహించాడు. లాఠీదెబ్బలకు, తుపాకిగుండ్లకు, చరసాల శిక్షలకు సయితం జంకకుండా స్వాతంత్ర్యసిద్ధికి పాటుపడిన యోధులలో ప్రథమశ్రేణివాడైనాడు. అతని ధైర్యసాహసాలు, వీరోచితపోరాటము వేలు, లక్షలమందిని ఉత్తేజపరచి ఉత్సాహపరచి రణరంగానికి దూకించినవి. చివరకు విజయదుందుభులు మ్రోగినవి. ఇజాక్ జాతీయనాయకుడుగా గుర్తించబడ్డాడు జయజయధ్వానాల మధ్య.

ఇజాక్‌కు పూలమాలలతో బ్రహ్మరథం పట్టారు ప్రజలు. ఇజాక్ రాజ్యాధినేత — ఊరేగింపు పోలీసు స్టేషను ముందుకురాగానే వేణు ఆప్యాయంగా ముందుకువెళ్ళి ఇజాక్ మెళ్ళో పూలదండవేసి అభినందించాడు. వేణు, ఇజాక్ ముఖాలపై చిందులు త్రొక్కిన ఆనందం యింతింతని వర్ణించలేము. ఊరేగింపు కదిలింది. వేణు, ఇజాక్‌వంక చూస్తూ నిలబడ్డాడు. గతాన్ని తలచుకున్న వారి మనోప్రవర్తులెలాగుండియుంటవో...

వేణు వాలుకుర్చీలో కూర్చొని కండ్లుమూశాడు. తన చిన్ననాటి రోజులు—ఇజాక్ "తనకోసం ఏదైనా త్యాగం చేయవచ్చు. నీతినియమాలు జీవయాత్ర సరళంగా సాగడానికి ఉపయోగపడకపోతే అనవసరం" అనేవాడు. మరి తనో "ఇతరులకొరకు ఎట్టి త్యాగాలయినా చేయాలనేవాడు నీతినియమాలు తప్పినవ్యక్తి సమాజంలో రాణించలేడనేది వేణు వాదన — ఒకరోజున వేణు, ఇజాక్ యిద్దరూ కలిసి బడికి వెళ్ళారు. నోటీస్ బోర్డుమీద జీతంకట్టనివారి పేర్ల లిస్టులో ఇజాక్ పేరుంది. దాంట్లోనే అతని పేరు హాజరుపట్టీనుండి తొలగించబడిందని కూడ నున్నది. అది చూడగానే ఇజాక్ వేణువంక జాలిగా చూచాడు. వేణు గడికి వెళ్ళివచ్చి జీతం కడదామని స్కూలును వదలి వెళ్ళాడు. కాని తిరిగి వచ్చేసరికి ఇజాక్ స్కూలులో లేడు. అరోజంతా ఇజాక్ కనుపించలేదు. మరునాడు సాయంకాలం బడినుండి యింటికి వెళ్ళేసరికి వేణుకొరకు ఇజాక్ ఎదురుచూస్తూ అరుగుమీద కూర్చొనియున్నాడు. వేణు అతనిని చూడగానే దుఃఖం పొంగిపొరలింది. ఏం మాట్లాడలేక అలాగే క్రిందచూస్తూ నిలబడ్డాడు. కొంత సేపయ్యాక "వేణూ! నాకొరకు ఎన్నాళ్ళిలా ఖర్చుపెడతావు? నాకు చదువుకొని బాగుపడే యోగముంటే మానాన్నే బ్రతికియుండేవాడు" అంటూ ఇజాక్ బావురుమన్నాడు. వేణుకు అతనిని ఏలా ఓదార్చాలో తెలియక అతనిని కౌగలించుకొని ఏడ్చాడు. ఇజాక్ మెల్లగా కండ్లు తుడుచుకుంటూ లేచి "నేను వెళ్ళివస్తాను వేణూ!" అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళడం?" రుద్ధకంఠంతో.

"ఎక్కడికని చెప్పేది! యీ విశాల ప్రపంచంలో ఎక్కడ నిలబడడానికి కాస్త చోటు దొరికితే అక్కడికి!"

వేణు నోటమాట పెగలలేదు.

"ఏ దొంగబ్రతుకైనా బ్రతుకగలను. ఎప్పటికైనా గుర్తుకువస్తే మాత్రం ఒక్కసారి నన్ను — బీదన్నేహితుణ్ణి తలచుకో!" అంటూ ఇజాక్ వెళ్ళిపోయాడు.

రోజులు మారాయి. ఇజాక్, వేణులు ఒకే సినిమాను చూస్తున్నారు. ఏదో మాటల సందర్భమున వేణు "ఏరా ఇజాక్! అల్లాంటి పనికెందుకు పూనుకున్నావురా! అంతకంటే బ్రతుకడానికి మరొక మార్గం కనుపించలేదా?" అన్నాడు. ఇజాక్ ముఖం నల్లబడింది. తలెత్తి చూడలేకపోయాడు. మెల్లగా "అవును — ఒక్కసారి జీవితంలో మచ్చ ఏర్పడితే చెరగిపోవడం అసంభవం. జీవితాంతంవరకూ..." అని అన్నాడు. వేణు చలించిపోయి నాలిక కొరుక్కున్నాడు. ఇద్దరూ మిత్రులూ సినిమా వదలగానే వారివారి గమ్యస్థానాలకు బయలుదేరివెళ్ళారు.

అప్పటినుండి ఇజాక్, వేణు ఎక్కడోక్కడ టీ పార్టీలలోనో, విందులలోనో, మీటింగ్‌లలోనో తరచుగా కలసికొంటూండేవాళ్లు. వేణు, ఉద్యోగధర్మంలో అవలంభించే నిజాయితీ, చిత్తశుద్ధి, శక్తిసామర్థ్యాలను చూచి ఇజాక్ పొంగిపొరలే ఆనందంతో "అందరూ నీలాగేయుంటే ధర్మం నాలుగుపాదాల నడుస్తుంది" అనేవాడు. ఇద్దరూ నిండు హృదయాలతో నవ్వుకొని పరస్పరం అభినందించుకునేవారు విచ్చిన నందివర్ధనాల్లాగ. పశ్చాత్తాపము మానవుని ఉచ్ఛస్థితికి తెస్తుందనుకునేవాడు వేణు.

వేణు ఎంత సమర్థుడుగా వ్యవహరించినా లంచం తీశికున్నాడని నేరం మోపబడింది. ఏమి చేయడానికి పాలుపోక తిరుగసాగాడు. పరిస్థితుల ప్రోద్బలంవల్ల నేరంచేశాడు — పట్టుబడ్డాడు. తనకీనాడు కావలసింది రక్షణ. అది లేకుంటే పతనం! అన్నివిధాల పతనం. తన్నీ ప్రపంచంలో రక్షించగలది ఇజాక్ ఒక్కడు మాత్రమే. అతనిని పోయి ఏమని అడుగగలడు! తానతనికి చేసిన అపకారానికి — కాదు — తన ధర్మమును నిర్వహించాడు. ఇజాక్ సహాయం కోరడమా, మానడమా అనే సందిగ్ధం ప్రతినిముషం బాధించసాగింది. ఇజాక్‌ను కలసికోవాలని నాలుగయిదుసార్లు బయలుదేరి వెళ్ళాడేకాని యింటి దగ్గరకు వెళ్ళి వెనుకకు తిరిగివచ్చాడు.

నేరం విచారణ మరునాడే. ఈ విషయం తెలిసి ఇజాక్ ఏమనుకుంటాడో! ఎంత బాధపడతాడో! అతనికి తనపట్లనున్న ప్రేమ, అభిమాన, ఆదరణలు ఏమయిపోతవోననే ఆందోళన ఎక్కువయింది. ఇజాక్‌ను పోయి తాను చేసిన నేరానికి శిక్షనుండి తప్పించమని అడగడం ఎంత ఆత్మగౌరవానికి భంగకరం! అయితే అంతకంటె గత్యంతరము! — యీ ఆలోచనలతో కుప్పకూలిపోయి కూర్చున్నాడు. చుట్టూ నిశ్శబ్దం — ఫాను తిరుగుతున్న శబ్దంమాత్రం వినిపిస్తున్నది. రాత్రి పదిగంటల సమయం. వేణు గుండెలు దడదడలాడుతున్నవి.

తెల్లవారితే విచారణ. తాను అబద్ధమాడలేదు. అబద్ధమాడకపోతే మరి ఏం జరుగుతుందనికూడ తెలుసు. తలవంచుకొని కూర్చొనియున్నాడు. గదిలోను, బయటకూడ నిర్మానుష్యంగా నున్నది. ఆ సమయం ఎవరో వస్తున్నట్లు చెప్పుల శబ్దంకాగానే తల పైకెత్తి ముందుకు చూచాడు. ఇజాక్ గదిలో ప్రవేశించాడు. అతనిరాక వేణుమీద పిడుగుపడ్డట్లయింది. స్వయంగా కుర్చీని ముందుకు లాక్కొని ఇజాక్ కూర్చుంటూ "వేణూ!" అని పలుకరించాడు. అది వినగానే వేణు కండ్లవెంట బొలబొల నీళ్లు కారినవి. నోటమాట పెగలలేదు.

ఇజాక్ మరింత దగ్గరగా కుర్చీ జరుపుకొని సానుభూతితో "వేణూ! అంతా నాకు తెలుసు. ప్రతిమానవుడు తప్పు చేయటం సహజం. కాని పశ్చాత్తాపపడి అలాంటివానినే మరల చేయకుండా జాగ్రత్తపడటం మన కర్తవ్యం" అన్నాడు.

వేణు ఏమి మాట్లాడలేదు.

"నేను అంతా విన్నాను. అయినా నీకేం బాధపడకు! భగవంతుడు నిన్ను, నన్నుకూడ రక్షిస్తాడు. గతాన్ని చూచి గుణపాఠం నేర్చుకొని జాగ్రత్తగా నుందాం!" అన్నాడు.

విచారణ ప్రమేయం లేకుండానే వేణుమీద నేరం గాలిబుడగలాగ తేలిపోయింది. ఇజాక్, వేణు ఆప్త మిత్రులు. వారి పరస్పర ప్రేమానురాగాలు, కొండల మీది మంచులాగ ఘనీభవించసాగింది.

విధి విరామం ఎరుగని కాలము, దాని ననుసరించిన గడియారం, క్యాలెండరు తేదీలు దొర్లిపోతున్నవి.

కడుపునొప్పి, నోట నీరూరుట, త్రేపులు, వాంతులు, మలబద్ధకము లాంటి అజీర్ణ లక్షణములకు

కేసరిగా

ఆదిత్యలవణము

దివ్యఔషధము

వెల రు. 1-75 న.పై.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు 14.

జాతక ఫలములకు

పెండ్లి పొంతనాలకు

ముహూర్తములకు

సంప్రదించండి!

చాల సంవత్సరాలుగా పేరు పొందిన

పాత్తూరి సుబ్బరాయశాస్త్రి

147 — 11 డి బాలాజీనగర్

మద్రాసు 14.